దార్శనిక దర్శనాలు

- కేసీఆర్ పాలనపై లెక్కలేనన్ని పుస్తకాలు
- దీక్షాదివస్ సందర్భంగా నేడు తెలంగాణ భవన్‌లో ప్రదర్శన

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): 'అక్షరరూపం దాల్చిన ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక' ప్రజాకవి కాళోజీ అన్నమాటలకు తెలంగాణ అక్షరరూపం ఇచ్చింది. మలిదశ ఉద్యమంలో పెన్నేగన్నుగా పేలింది. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలను అక్షరం ఏకం చేసింది. ఉద్యమకారులు, బుద్ధజీవులు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను అక్షరబద్ధం చేశారు. కవులు, రచయితలు అవ్వల్‌దర్జా అసలైన తెలంగాణను ఆవిష్కరించారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని అస్థిత్వమంత ఎత్తుకు తీసుకెళ్లారు. పాలకుడికి సాంస్కృతిక ధార తోడైతే పాలన పరిపుష్టి చెందుతుందని చరిత్ర చెప్పిన సత్యాన్ని గమనంలోకి తీసుకొని ఉద్యమ నాయకుడు పాలకుడైతే ఎట్లా ఉంటుందో కేసీఆర్ పదేండ్ల పాలన కండ్లకు కట్టింది. కేసీఆర్ దార్శనిక పాలన భౌతికంగా నిర్మాణాల రూపంలో, నైతికంగా ప్రజా జీవనంలో ప్రస్ఫుటం చేస్తున్నాయి. నవంబర్ 29, డిసెంబర్ 9 దాకా 11 రోజులపాటు బీఆర్ఎస్ పార్టీ దీక్షాదివస్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 2010 నుంచి 2013 దాకా దీక్షా దివస్ కార్యక్రమాలు ఉద్యమానికి పునఃశ్చరణగా నిర్వహిస్తే, 2014 నుంచి 2023 దాకా ఉద్యమస్ఫూర్తితో తెలంగాణ ప్రస్థానయాత్రను కొనసాగించారు. ఈ క్రమంలో ఏడాదిగా కాంగ్రెస్ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆయా రంగాల్లో సాధించిన ప్రగతిపై వందల కొద్దీ పుస్తకాలు వెలువడ్డాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీబీసీ 'లిఫ్టింగ్ ది రివర్' అనే డాక్యుమెంటరీతోపాటు రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితి కీర్తించింది. ఆర్‌బీఐ, నీతిఆయోగ్ సహా అనేక జాతీయ సంస్థలు తెలంగాణ ప్రగతిని ఆకాశానికి ఎత్తాయి. కేసీఆర్ పాలనలో ఆయా సందర్భాల్లో, ఆయన చేసిన కీలక ప్రసంగాలతోపాటు ఆయన దార్శనిక విలువను తెలంగాణ కవులు, రచయితలు అక్షరబద్ధం చేశారు. పాలకుడిగా కేసీఆర్ పాలనా విధానాలు, వాటి పర్యవసానాలపై వచ్చినన్ని పుస్తకాలు దేశంలో మరే ముఖ్యమంత్రికి వచ్చి ఉండవని రచయితలు చెప్తున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలన పర్యవసానాలు, తెలంగాణ ఉద్యమ నేపథ్యాలను పార్టీ శ్రేణులు పునఃశ్చరణ చేసుకొని తద్వారా స్ఫూర్తి పొందాలనే ఉద్దేశంతో దీక్షాదివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెలంగాణభవన్‌లో బుక్‌ఫెయిర్ నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలో చీకట్లోకి చేతివృత్తులు

- ఉచిత చేప పిల్లలు పంపిణీలో కోతలు
- జాడలేని మత్స్య సహకార ఎన్నికలు
- రోడ్డెక్కుతున్న నాయీ బ్రాహ్మణులు
- ఏం సాధించారని విజయోత్సవాలు?
- రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, కృష్ణారావు విమర్శలు

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద. పక్కన ఎమ్మెల్యే కృష్ణారావు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సబ్బండ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపితే.. ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి చేతివృత్తులపై ఆధారపడ్డవారి జీవితాలను చీకట్లోకి నెట్టారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులు సహా వివిధ చేతివృత్తుల వారికి కేసీఆర్ ప్రోత్సాహకాలు అందిస్తే రేవంత్‌రెడ్డి కోతలు పెట్టారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలసి వివేకానంద మీడియాతో మాట్లాడారు. చేతి వృత్తులవారు రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేసే దుస్థితిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. తెలంగాణలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని, ఏం సాధించారని ఏడాది పాలన సంబరాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. కుల వృత్తులకు అందాల్సిన ప్రోత్సాహకాలు అందించకపోతే బీఆర్ఎస్ ఆందోళనబాట పడుతుందని హెచ్చరించారు.

కేసీఆర్‌తో టచ్‌లో కాంగ్రెస్ నేతలు!

కాంగ్రెస్ సీనియర్లు చాలామంది కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని కేపీ వివేకానంద తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డిపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే విశ్వాసంలేదని విమర్శించారు. రేవంత్‌కు కాంగ్రెస్‌పై పట్టుంటే మంత్రి వర్గ విస్తరణ చేసే వారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులపై పోరాటం తప్పదని హెచ్చరించారు.

బస్తీ దవాఖానల్లో మందు గోలీల్లేవ్: కృష్ణారావు

హైదరాబాద్‌లోని బస్తీ దవాఖానల్లో ఎక్కడా మందులు లేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దవాఖానల్లో మంగళవారం పర్యటించానని, ఎక్కడ కూడా బీపీ, షుగర్ గోలీలు లేవని తెలిపారు. ఇందుకేనా కాంగ్రెస్ సంబురాలు చేసుకునేది? అని ప్రశ్నించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి బస్తీ దవాఖానలను సందర్శించాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌మీట్‌లో కరెంట్ పోవడంపై కృష్ణారావు భగ్గుమన్నారు. కరెంటు కోతలు కూడా నిత్య కృత్యం అయ్యాయని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జీలు, ఎస్టీపీలను కాంగ్రెస్ నేతలు తమ ఘనతగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.

దేశవ్యాప్తంగా 53 టెలీమానస్ సెల్స్

ఎంపీ వద్దిరాజు ప్రశ్నకు బదులిచ్చిన కేంద్రం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా 53 టెలీమానస్ కేంద్రాలు మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడుతున్న వారికి సాయం అందిస్తున్నాయని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర చర్చలో పాల్గొన్నారు. 'మానసిక ఆరోగ్య రుగ్మతలపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రత్యేకించి గ్రామీణ, చిన్న పట్టణాలలో కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకుంటుంది? ఈ విషయంలో ఆశావర్కర్స్, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారా? ఈ సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?' అని కేంద్రాన్ని ప్రశ్నించారు. అనంతరం కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా, సహాయ మంత్రి ప్రతాపరావు గణపత్‌రావు జాదవ్ బదులిచ్చారు. 'ఆయుష్మాన్ భారత్' లక్షకుపైగా కేంద్రాలకు విస్తృతం చేశామని, 30 ఏండ్లకు పైబడినవారికి షుగర్, బీపీ, దంత, మానసిక, క్యాన్సర్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. మానసిక ఆరోగ్య రుగ్మతల నివారణకు 2022 అక్టోబర్ 10న 'నేషనల్ టెలీమెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేక యాప్ ద్వారా సేవలు అందిస్తున్నామని 53 సహాయక కేంద్రాలను(టెలీమానస్ సెల్స్) ఏర్పాటు చేశామని వివరించారు. మానసిక రుగ్మతతో ఇబ్బంది పడే వారిని మొదట ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సైకియాట్రిస్ట్‌తో సరైన అవగాహన కల్పిస్తున్నారని వివరించారు.

రైతులపై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదు

- రైతుల ఆర్థిక పరిస్థితి అధ్వానం
- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

ఖానాపురం, డిసెంబర్ 3 : బీఆర్ఎస్ పాలనలో పండుగలా ఉన్న వ్యవసాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే దండుగలా మార్చిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రైతులపై సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. వరంగల్ జిల్లా ఖానాపురంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడా రు. రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ క్రీడను ప్రారంభించాడని, దీంతో వారి ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింటున్నదని అన్నారు. గతంలో ఎంతో మంది సీఎంల పాలన చూశామని, రేవంత్‌రెడ్డి లాంటి దిగజారిన పాలనను ఎప్పు డూ చూడలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేసింది గ్రామీణ ప్రాంత ప్రజలేనని గుర్తుంచుకోవాలని అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క పథకమైనా సంపూర్ణంగా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలోని పథకాలను కొనసాగిస్తే కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందని.. వాటినే రద్దు చేసిన నీచ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని దుయ్యబట్టారు.

మీడియాతో మాట్లాడుతున్న వై సతీశ్‌రెడ్డి. చిత్రంలో నాయకులు

అంతా రివర్సే.. రైజింగ్ ఎక్కడ?

- ఏడాదిలో ఏం సాధించారు?
- 10 నెలల్లో 35 వేల కోట్ల రాబడి లోటు
- పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపనలో సర్కార్ ఘోరంగా విఫలం : వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏం సాధించిందని తెలంగాణ రైజింగ్ పేరిట ఉత్సవాలు నిర్వహిస్తున్నదని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. '10 నెలల్లో రూ.35 వేల కోట్ల రాబడి లోటు ఉన్నందుకా? పరిశ్రమల స్థాపనలో విఫలమైందుకా? పెట్టుబడుల సాధనలో వెనుకబడినందుకా? ఉద్యోగాలివ్వడంలో ఫెయిలైనందుకా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణను అన్ని రంగాల్లో పదేండ్లు వెనక్కి తీసుకెళ్లిన రేవంత్ సర్కారు నిర్వహించుకోవాల్సింది రైజింగ్ పండుగ కాదని, రివర్సింగ్ పండుగని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత రాఘవతో కలిసి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతేడాది 2,600 పరిశ్రమలు వస్తే రేవంత్‌రెడ్డి వచ్చాక ఈ ఏడాదిలో కేవలం 1,200 మాత్రమే వచ్చాయని వివరించారు. 2015లో రూ. 28 వేల పెట్టుబడులు సాధిస్తే ఈ ఏడాది కేవలం రూ.8,468 కోట్లేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో 18.60 లక్షల ఉద్యోగాలు (సగటున ఏడాదికి 1.80 లక్షలు) వస్తే ఈ ఏడాది ఇచ్చింది 34 వేల ఉద్యోగాలేనని, వాటికీ బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చినవేనని గుర్తుచేశారు. నిర్బంధాలు, కూల్చివేతలు, లైంగికదాడులు, లాఠీచార్జీలు, విద్యార్థుల మరణాలు, జర్నలిస్టులపై కేసులు, రైతులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలలో తెలంగాణ రైజింగ్ అవుతున్నదని దెప్పిపొడిచారు.

సామాజిక న్యాయంతోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఓబీసీలకు ప్రత్యేక శాఖ ఉండాలి
- బీసీలు, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్
- ఇద్దరు బీసీలకే మంత్రి పదవులిచ్చి అన్యాయం: వద్దిరాజు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): సామాజిక న్యాయంతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. మహారాష్ట్ర సదన్‌లో మంగళవారం నిర్వహించిన ఆలిండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్ మూడో జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. 85 కోట్ల మంది బీసీలు, జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం ఉంటేనే దేశం ముందుకెళ్తుందని తెలిపారు. కులగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలం పెట్టాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఓబీసీలకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటుందని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏడాది సంబరాలను గ్రామాల్లో చేపడితే ప్రజాసమస్యలు తెలుస్తాయని హితవు పలికారు. దేశంలో బీసీలు 60 శాతానికి పైగా ఉన్నా అన్యాయమే జరుగుతున్నదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీ అయిన నరేంద్ర మోదీ పదేండ్లు ప్రధాన మంత్రిగా ఉన్నా బీసీలకు ఎలాంటి మేలు చేయలేకపోయారని విమర్శించారు. కేవలం ఇద్దరు బీసీ నేతలకు మంత్రి పదవులిచ్చి తెలంగాణలో తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. తెలంగాణలోని కుల గణనను ప్రజలు విశ్వసించడం లేదని, ప్రజామోదయోగ్యంగా ఉండేలా ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు.

ఇకపై గ్రామీణ బ్యాంకు ఒక్కటే..

- ఒకే గొడుగు కిందికి ఆర్ఆర్‌బీలు
- 'తెలంగాణ స్టేట్ గ్రామీణ బ్యాంకు'గా ఏర్పాటు
- నాబార్డుకు ప్రతిపాదనలు పంపిన కేంద్రం
- ఫలించిన మాజీ ఎంపీ వినోద్ కుమార్ కృషి

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): నాబార్డు పరిధిలోని రీజినల్ రూరల్ బ్యాంకులన్నింటినీ కలిపి తెలంగాణ స్టేట్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. 2025 జనవరి నుంచి అందుబాటులోకి తీసుకురావాలని నాబార్డుకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని ఆర్ఆర్‌బీలన్నింటినీ ఒకే పెద్ద బ్యాంకుగా ఏర్పాటు చేసేందుకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చేసిన కృషి ఫలించింది. ఈ మేరకు తన విజ్ఞప్తులకు స్పందించిన కేంద్ర ప్రభుత్వానికి మంగళవారం వినోద్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఆర్‌బీలు 950పైగా శాఖ లు, 17 ప్రాంతీయ కార్యాలయాలతో రాష్ట్రంలో అతిపెద్ద నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాయి. 2014లో రాష్ట్ర విభజన నాటి నుంచి ఈ సమస్య పెండింగ్‌లోనే ఉన్నది. 2024 అక్టోబర్‌లో ఆస్తులు, అప్పుల విభజనకు రెండు తెలుగు రాష్ట్రాలు సమ్మతించడంతో తెలంగాణ స్టేట్ గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దశాబ్దకాలంగా వినోద్ కుమార్ ఈ సమస్యను పార్లమెంట్‌లో లేవనెత్తడంతోపాటు డీఎఫ్ఎస్ కార్యదర్శిని కలిసి విన్నవించారు. బ్యాంకు యూనియన్లు నిర్వహించిన సమావేశాలు, ధర్నా ల్లో పాల్గొన్నారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పలు మార్లు వినతులు సమర్పించారు. దీంతో రాష్ట్రం మొత్తానికి ఒకే గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలని కేంద్రం నాబార్డుకు సూచించింది.

పెరిగిన రైతు ఆత్మహత్యలు

- 620 మంది బలవన్మరణం
- సంబురాలతో ప్రజాధనం వృథా
- పెద్దపల్లిలో 95 వేల మందికి రుణమాఫీ కాలేదు
- కొప్పుల ఈశ్వర్ ఫైర్
- భ్రమల్లో ముంచుతున్న కాంగ్రెస్: దాసరి మనోహర్‌రెడ్డి
- సీఎం పర్యటనను అడ్డుకోవాలి: పుట్ట మధు పిలుపు

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో రైతులు ఆత్మహత్యలు మళ్లీ పెరిగాయని, ఒక్క ఏడాదిలోనే 620 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా మళ్లీ సమైక్య రాష్ట్రంనాటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని, మరోవైపు ఏదో సాధించినట్టు సంబరాలు చేసుకుంటున్నదని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ హామీనీ అమలుచేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో రైతు ఏ కారణంతో చనిపోయినా రూ.5 లక్షల రైతు బీమా మొత్తం వచ్చేదని, ప్రస్తుతం ఆ రైతు బీమా కూడా రావడం లేదని మండిపడ్డారు.'రైతు రుణమాఫీ సరిగా జరగలేదని, రైతు భరోసా ఇవ్వడమే లేదని, సాగునీటి సదుపాయాలు కుంటుపడ్డాయని మండిపడ్డారు. రైతు భరోసా ఇవ్వబోమని ప్రభుత్వం, మంత్రులు రైతులను మానసికంగా సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఐదు లక్షల క్వింటాళ్ల సన్న వడ్లకు మాత్రమే రూ.25 కోట్ల బోనస్ ఇచ్చి చేతులు దులుపుకున్నదని విమర్శించారు.

పెద్దపల్లి జిల్లాకిచ్చిన హామీలపై తేల్చిచెప్పాలి

ఎన్నికల ముందు పెద్దపల్లి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలపై సీఎం రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల అమలుపై జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ అవసరాల కోసమే కాంగ్రెస్ పాలకులు ప్రజలను ఇంకా భ్రమల్లో ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు చెప్తేనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం పెద్దపల్లి పర్యటనను రైతులు, యువకులు అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిలదీయాలని కోరారు. సీఎం పర్యటన పెద్దపల్లికి చీకటి అడుగుగా ఆయన అభివర్ణించారు. 'యువ వికాసం కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అసలు యువవికాసం కింద ఏ హామీలు ఇచ్చారో కాంగ్రెస్ పెద్దలకు గుర్తున్నదా? యువకులకు ఏమీ చేయకుండానే యువ వికాసం సంబురాలా? సీఎం పర్యటన నేపథ్యంలో స్థానిక పోలీసులు నిర్బంధం అమలు చేస్తున్నారు' అని మండిపడ్డారు.

పెద్దపల్లిలో రైతులకు సీఎం సమాధానం చెప్పాలి

పెద్దపల్లిలో లక్షా 55 వేల మంది రైతులుండగా, 95 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని కొప్పుల ఈశ్వర్ వివరించారు. పెద్దపల్లికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ రైతులందరికీ ఎందుకు రుణమాఫీ కాలేదో సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, రైతు పండగ చేసుకోవడం చూసి రైతులే నవ్వుకుంటున్నారని విమర్శించారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని సంబురాల పేరుతో వృథా చేస్తున్నారని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 50 మంది గురుకుల విద్యార్థులు చనిపోయినా రేవంత్ సర్కారు చలించడం లేదని మండిపడ్డారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న దేవీప్రసాద్. చిత్రంలో మన్నె గోవర్ధన్‌రెడ్డి, భుజంగరావు

ఉద్యోగులకూ కాంగ్రెస్ సర్కారు ధోకా

- 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి
- బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనలో ఉద్యోగులను అన్నిరకాలుగా మోసం చేసిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 317 జీవో సమస్యను అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో పరిష్కరిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు నెలలు కాలయాపన చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ నివేదికకొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణభవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, భుజంగరావుతో కలసి దేవీప్రసాద్ మీడియాతో మాట్లాడారు. స్థానికత అంశాన్ని సబ్ కమిటీ పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఉద్యోగులు సీఎంవో చుట్టూ తిరుగుతున్నా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని, 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కారు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లే తప్ప రేవంత్‌రెడ్డి కొత్తగా చేసిందేమీ లేదని, ఉద్యోగుల ఒక్క డిమాండ్‌ను కూడా రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదని ధ్వజమెత్తారు.

దివ్యాంగులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న వాసుదేవరెడ్డి. చిత్రంలో దేవీప్రసాద్, రావుల

దివ్యాంగుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

- పింఛన్‌ను గణనీయంగా పెంచారు
- డబుల్ ఇండ్లల్లో 5% రిజర్వేషన్లు
- దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి
- తెలంగాణ భవన్‌లో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమానికి కేసీఆర్ సర్కార్ ఎంతో కృషిచేసిందని దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి చెప్పారు. నాడు 500 ఉన్న వికలాంగుల పింఛన్ రూ.4 వేలకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో కేసీఆర్ దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. దివ్యాంగుల కోసం కేసీఆర్ తెచ్చిన అనేక పథకాలకు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు.

దివ్యాంగుడికి 24 వేల బాకీ: దేవీప్రసాద్

రాష్ట్రంలోని ప్రతి దివ్యాగుడికి రేవంత్‌రెడ్డి సర్కారు రూ.24 వేలు బాకీ పడిందని దేవీప్రసాద్ విమర్శించారు. 4 వేల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి ఏడాదైనా పెంచలేదని, 12 నెలలకు ఒక్కో నెలకు రూ.2 వేల చొప్పున రూ.24 వేలు చెల్లించాల్సి ఉన్నదని అన్నారు.

మానవత్వానికి మారుపేరు కేసీఆర్

కేసీఆర్ ప్రభుత్వం అంటేనే మానవత్వానికి మారుపేరని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. దివ్యాంగులు అడగకుండానే కేసీఆర్ అన్నీ ఇచ్చారని, పింఛన్ మొత్తాన్ని పెంచడంతోపాటు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారని గుర్తుచేశారు. రేవంత్ పాలన పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు.

ప్రాణాలు పోతున్నా స్పందించరా?

- ప్రమాదాలపై నిరసనగా అఖిలపక్షం భారీ ధర్నా
- పనులను త్వరగా పూర్తి చేయాలని నేతల డిమాండ్
- స్పందించకపోతే ఆమరణ దీక్ష చేస్తా: కార్తీక్‌రెడ్డి
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు: శుభప్రద్ పటేల్

ఆలూరు గేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల టౌన్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఆలూర్ గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి, నలుగురు మృతి చెందిన ఘటనపై స్